సాక్షి
యాదాద్రి భువనగిరి

శనివారం । 12 । ఆగస్టు । 2023



విజన్ ఉన్న నాయకుడు కేసీఆర్
సీఎం కేసీఆర్ విజన్‌తో పని చేసే నాయకుడని గొంగిడి సునీత, గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు.
- 10లో



వృత్తిపై మమకారం..
తనలో ఉన్న సృజనాత్మకతకు ఆధునికత జోడించి నూతన డిజైన్లు సృష్టిస్తున్నాడు.. పోచంపల్లికి చెందిన భరత్.
- 10లో



ఎయిమ్స్‌కు ప్రత్యేక సబ్‌స్టేషన్
బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాలకు విద్యుత్ సరఫరా చేయడానికి ప్రత్యేకంగా సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు.
- 12లో

న్యూస్‌రీల్

ఓపెన్ స్కూళ్లను సద్వినియోగం చేసుకోవాలి

భువనగిరి : చదువు మధ్యలో మానివేసిన వారు ఓపెన్ స్కూళ్లను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూళ్ల కన్వీనర్ జగదీష్ తెలిపారు. శుక్రవారం భువనగిరిలోని ఓపెన్ స్కూల్‌ను ఆయన సందర్శించారు. ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నవారు కూడా పదోన్నతి కోసం ఓపెన్ స్కూల్‌లో టెన్త్, ఇంటర్ చదివే అవకాశం ఉందన్నారు. అనంతరం అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీనివాస్, శ్రవణ్‌కుమార్, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి, బాలకృష్ణ, సోమిరెడ్డి, విజయలక్ష్మి, శేషాచారి, అశోక్, సరోజా తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో ఊంజలి సేవ



అమ్మవారికి హారతినిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో శుక్రవారం సాయంత్రం ఆండాళ్ అమ్మవారికి ఊంజలి సేవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ వీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో ఊంజలి సేవ జరిపించారు. మహిళలు మంగళ హారతులతో సేవకు స్వాగతం పలికారు. ఇక ప్రధానాలయంలోనూ విశేష పూజలు కొనసాగాయి. వేకువజామున ఆచార్యులు సుప్రభాతం చేపట్టారు. అనంతరం స్వయంభూలకు అర్చన, అభిషేకం, ఆరాధన చేసి తులసీదళాలతో అర్చించారు. అదే విధంగా ఆలయ ముఖ మండపం, ప్రాకార మండపాల్లో శ్రీసుదర్శన నారసింహహోమం, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవ, సాయంత్రం శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

చేనేతపై ధీమా కల్పించండి

- సిరిసిల్లలో మాదిరిగా వస్త్ర తయారీ ఆర్డర్లు ఇస్తే ఉపాధి
- కలగానే చేనేత కాలనీలు
- దరఖాస్తు చేసుకున్నా అందని పింఛన్
- మంత్రిపైనే నేత కార్మికుల ఆశలు
- నేడు పోచంపల్లికి రానున్న చేనేత, జౌళి శాఖ మంత్రి కేటీఆర్



సాక్షి, యాదాద్రి : చేనేత, జౌళి, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు భూదాన్‌పోచంపల్లి పర్యటనపై చేనేత కళాకారులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం కల్పించిన పథకాలకు తోడుగా చేతినిండా పని కల్పించాలని కోరుతున్నారు. సిరిసిల్ల నేతన్నలకు మాదిరిగా తమకూ వస్త్ర తయారీ ఆర్డర్లు ఇస్తారని, తయారు చేసిన వస్త్రాలకు మార్కెట్ సౌకర్యం కల్పిస్తారని ఎదురు చూస్తున్నారు. పోచంపల్లి టైఆండ్‌డై చీరలను కాపీ కొట్టి ప్రింటెడ్ చీరల తయారీని అడ్డుకోవాలని, చేనేత కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

టై అండ్ డై ఇక్కత్‌కు ప్రింటెడ్ ఎఫెక్ట్

పోచంపల్లి కేంద్రంగా తయారతున్న టై అండ్ డై ఇక్కత్ వస్త్రాలకు ప్రింటెండ్ చీరల ఎఫెక్ట్ పడింది. ఇక్కత్ చీరలను పోలిన ప్రింటెడ్ చీరలు తక్కువ ధరకు మార్కెట్‌లో లభిస్తున్నాయి. దీంతో కార్మికుల ఉపాధిపై కోలుకోలేని దెబ్బపడుతోంది.

ఆర్డర్ల కోసం ఎదురుచూపు

టెస్కో ద్వారా ప్రభుత్వం సిరిసిల్లకు కార్మికులకు బతుకమ్మ చీరలు, జాతీయ పతాకాలు, స్కూల్ విద్యార్థుల యూనిఫాం, ఆస్పత్రులకు కర్టెన్లు వంటి తయారీ ఆర్డర్లు ఇస్తుంది. తమకూ ఇవ్వాలని జిల్లా పవర్‌లూమ్ యజమానులు కోరుతున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 25 వేల మంది పవర్‌లూమ్ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. అలాగే పవర్ లూమ్‌లపై తయారైన వస్త్రాలను అమ్ముకోవడానికి మార్కెట్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

'నేతన్నకు చేయూత' రెండో విడత

నేతన్నకు చేయూత పథకం రెండో విడత కొనసాగుతోంది. కరోనా సమయంలో ఆరు నెలల ముందే త్రిఫ్ట్ పథకంలోని సభ్యులకు లబ్ధి చేకూరింది. మరో ఆరు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు రానున్నాయి. నోటిఫికేషన్‌కు ముందుగానే రెండో విడతలో కూడా లబ్ధి చేకూర్చాలని చేనేత కుటుంబాలు కోరుతున్నాయి.

ఇళ్లులేని కుటుంబాలు

గత ప్రభుత్వాలు ఇళ్ల కం వర్క్ షెడ్‌లు నిర్మించి ఇచ్చేవి. ప్రస్తుతం పలు చేనేత కుటుంబాలు ఇళ్లు లేక అద్దె ఇళ్లలో ఉంటున్నారు. ప్రత్యేక కాలనీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అలాగే 50 ఏళ్లు నిండిన వేలాది మంది పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుని ఎదురు చూస్తున్నారు.

దరిచేరని పథకాలు

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పూర్తిస్థాయిలో దరి చేరడం లేదని కార్మికులు అంటున్నారు. జిల్లాలో జియోట్యాగ్ చేసిన చేనేత మగ్గాలు 6,681, పవర్‌లూమ్ రంగంలో 2,165 మంది ఉన్నారు. ఇతర వృత్తుల్లో 25 వేల మందికి పైనే ఉన్నారు. ఆర్థిక సహాయం చేయడానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు చేస్తేనే మేలు



పద్మశాలీల్లో 90 శాతం మంది అసంఘటిత రంగాల్లో పని చేస్తున్నారు. వీరిలో చాలా మంది నైపుణ్యం కలిగిన ఉన్నప్పటికీ జీవనం సాగించడానికి నైపుణ్యం లేని వృత్తిలో కొనసాగుతున్నారు. కుటుంబ పోషణ కోసం వలస వెళ్తున్నారు. కాబట్టి చేనేత కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఏటా బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి.

–తడక యాదగిరి, సామాజిక శాస్త్రవేత

మాకూ వస్త్ర తయారీ ఆర్డర్లు ఇవ్వాలి



ఇక్కడ నైపుణ్యం కలిగిన నేతన్నలు ఉన్నారు. బతుకమ్మ చీరలు, పాఠశాల యూని ఫాం ఇతర వస్త్రాలు తయారు చేస్తాం. ప్రస్తుతం తయారు చేస్తున్న వస్త్రాలకు మార్కెట్ సౌకర్యం కల్పించాలి. వస్త్ర ఉత్పత్తి ఆర్డర్లు ఇవ్వాలి. ఉచిత కరెంట్, ఇల్లులేని వారికి ఇళ్లు, పింఛన్‌లు ఇవ్వాలి.

–కట్కం వెంకటేశం, పవర్‌లూమ్ మాస్టర్ వీవర్, రఘునాథపురం

గణన పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సాక్షి,యాదాద్రి : వ్యవసాయ గణన పకడ్బందీగా చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో వ్యవసాయ శాఖ అధికారులు, ఏఎస్‌ఓలకు గణపై శిక్షణ ఇచ్చారు. మూడు దశల్లో గణన చేపట్టాలని, మొదటి విడతలో ఏఈఓలు రైతుల ఇళ్లకు వెళ్లి కమతాల వారీగా సన్న, చిన్నకారు, పాక్షిక మధ్యస్థ, మధ్యస్థ, భారీ రైతులు, వారి వయస్సు, విద్యార్హతలు, సామాజిక, కుటుంబ వివరాలు, భూమి వినియోగం, నీటిపారుదల వసతి వివరాలను సేకరించాలన్నారు. రెండవ దశలో కమతాలు, పంటల సాగు, నీటిపారుదల శాఖ సమాచారం సేకరించాలని సూచించారు. మూడవ విడతలో కమతాల ఇన్‌పుట్, ఎరువులు, పురుగు మందుల వినియోగం, పశు సంపద, వ్యవసాయ పరికరాల సమాచారం సేకరించాలన్నారు. సేకరించిన సమాచారాన్ని మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రములో ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్ డైరెక్టర్ దయానందం, డిప్యూటీ డైరెక్టర్ శివకుమార్, ప్రణాళికాధికారి మాన్యనాయక్, స్టాటిస్టికల్ ఆఫీసర్ రాజ్యం, మాస్టర్ ట్రైనీ దీప్తి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, ఏడీఏ, ఏఈఓలు, ఏఓలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంపై ప్రదర్శనల ద్వారా ప్రజలకు తెలియజేయాలని అదనపు రాష్ట్ర సాంస్కృతిక సారథి జిల్లా కళాకారులకు సూచించారు.

నేడు నేతన్న విగ్రహాన్ని ఆవిష్కరించనున్న కేటీఆర్





ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, డీసీపీ రాజేశ్‌చంద్ర

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలో పద్మశాలి మహాజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేతన్న విగ్రహాన్ని శనివారం చేనేత, జౌళి శాఖ మంత్రి కేటీఆర్ ఆవిష్కరించనున్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అలాగే సాయిని భరత్ నెలకొల్పిన కళాపునర్వి హ్యాండ్లూమ్ ప్రారంభిస్తారు. అనంతరం బాలాజీ ఫంక్షన్ హాల్‌లో జరగనున్న సభలోప్రసంగించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లనుఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, డీసీపీ రాజేశ్‌చంద్ర పరిశీలించారు. వారి వెంట జిల్లా చేనేత జౌళిశాఖ ఏడీ విద్యాసాగర్, ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మిశ్రీనివాస్, చౌటుప్పల్ ఆర్డీఓ జగన్నాథరావు, తహసీల్దార్ వీరాబాయి, ఎంపీడీఓ బాలశంకర్ తదితరులు ఉన్నారు.

కేటీఆర్ పర్యటన షెడ్యూల్ ఇదీ..

- హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గాన ఉదయం 11 గంటలకు పోచంపల్లికి చేరుకుంటారు.
- మొదట కళాపునర్వి ఇంటిగ్రేటెడ్ హ్యాండ్లూమ్ యూనిట్‌ను ప్రారంభిస్తారు
- 11.30కి నేతన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం సమీకృత మార్కెట్, దోభీఘాట్, సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేస్తారు
- 12.15 : బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో హ్యాండ్లూమ్ పార్కుకు శంకుస్థాపన చేస్తారు
- 12.30 :చేనేత కార్మికులతో నియోజకవర్గ స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడుతారు.
- 2 గంటలకు హైదరాబాద్ బయలుదేరి వెళ్తారు. కేటీఆర్ వెంట మంత్రి జగదీశ్‌రెడ్డి రానున్నారు.

పంద్రాగస్టుకు ఏర్పాట్లు చేయండి

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

సాక్షి, యాదాద్రి : స్వాతంత్య్ర దినోత్సవానికి ఏర్పాట్లు ఘనంగా ఉండాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమైన వేడుకల ఏర్పాట్లపై సమీక్షించారు. జిల్లా ప్రగతిపై అతిథి ప్రసంగం పాఠానికి వివిధ శాఖల అధికారులు క్లుప్తంగా, స్పష్టంగా నోట్స్ ఇవ్వాలన్నారు. అతిథులు, స్వాతంత్య్ర సమరయోధులు, ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు పంపాలని, వేడుకల్లో విద్యార్థులు పాల్గొనేలా చూడాలన్నారు. ప్రశంసా పత్రాలకు సంబంధించి ఎక్కువ ఉద్యోగులు ఉన్న శాఖ నుంచి మూడె, తక్కువగ ఉన్న శాఖ నుంచి ఒకరి పేరు పంపాలన్నారు. వేదిక నిర్మాణం, ఫ్లవర్ డెకరేషన్, షామియానాలు, మైక్ సౌండ్, అభివృద్ధి, సంక్షేమ పథకాల స్టాళ్ల ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది విధిగా వేడుకలకు హాజరుకావాలని ఆదేశించారు. అనంతరం కలెక్టరేటు ఆవరణలో వేదిక నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టరు వీరారెడ్డి, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, ఆర్డీఓ అమరేందర్, అడిషనల్ డీసీపీ రవికుమార్, డీఆర్‌ఓ పద్మజారాణి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, రోడ్లు భవనాల శాఖ ఈఈ శంకరయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్, ఎస్సీ అభివృద్ధి అధికారి జయపాల్‌రెడ్డి, బీసీ సంక్షేమ అధికారి యాదయ్య, జిల్లా ఎక్సైజ్ అధికారి నవీన్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలి

- కేంద్ర రవాణా, రోడ్ల శాఖ మంత్రిని కలిసిన ట్రిపుల్ ఆర్ భూ బాధితులు

భువనగిరి: రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని కేంద్ర రవాణా, రోడ్ల శాఖ మంత్రి విజయకుమార్ సింగ్‌ను కోరేందుకు బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ట్రిపుల్ ఆర్ భూ బాధిత రైతులు ఢిల్లీకి వెళ్లారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే జాతీయ రహదారి విస్తరణ, కాళేశ్వరం ప్రాజెక్టు కాల్వలకు, యాదాద్రి అభివృద్ధితో రైతులు భూములు కోల్పోయారని, ప్రస్తుతం ట్రిపుల్ ఆర్ కోసం ఉన్న భూమిని కోల్పోవాల్సి వస్తోందని గూడూరు నారాయణరెడ్డి మంత్రికి వివరించారు. మంత్రిని కలిసిన వారిలో రైతులు మధుసూదన్, వెంకటేష్, అనిల్, మల్లారెడ్డి, పాండు, యాదిరెడ్డి, వైకుంఠం, నరేందర్, నాగయ్య తదితరులున్నారు.

రమేష్‌కు డాక్టరేట్



వలిగొండ: మండలంలోని పహిల్వాన్‌పురానికి చెందిన కంబాలపల్లి రమేష్ డాక్టరేట్ పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగంలో ఇకలాజికల్ స్టడీస్ ఆఫ్ మైనర్ రిజర్వాయర్ అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను డాక్టరేట్ అందుకున్నారు. ప్రస్తుతం రమేష్ వలిగొండ మండలంలోని లోతుకుంటలోని మోడల్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. డాక్టరేట్ పొందిన ఈయనకు పాఠశాల ప్రిన్సిపాల్ రాము, ఉపాధ్యాయులు అనసూయ, వెంకటేష్, పృథ్వీరాజ్, ప్రవీణ్, మహేందర్, రవీందర్ రెడ్డి, లింగస్వామి అభినందనలు తెలిపారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి

భువనగిరి: జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం యూత్ ఫెస్ట్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో 5కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ పాపారావు మాట్లాడారు. 5కే రన్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ధరణికుమార్, సతీస్ కుమార్, సంపదయ్య, సైదులు, సీడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ భాను కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తిపై మమకారం.. ఉన్నతికి సోపానం

- ఎంటెక్ చేసి ఉద్యోగాన్ని వదిలి కులవృత్తిలోకి..
- చేనేత వృత్తిలో రాణిస్తూ పలువురికి ఉపాధి
- టీ–టాప్ ద్వారా కళాపునర్వి హ్యాండ్లూమ్ యూనిట్ ఏర్పాటు
- నేడు యూనిట్‌ను ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్





సాయిని భరత్ నిర్వహిస్తున్న కళా పునర్వి హ్యాండ్లూమ్స్‌లో పనిచేస్తున్న చేనేత కార్మికులు

భూదాన్‌పోచంపల్లి : కులవృత్తిపై ఉన్న మమకారం ఆ యువకుడిని ప్రయోగాలకు పురికొల్పింది. తనలో ఉన్న సృజనకు ఆధునిక సాంకేతికతను జోడించి నూతన డిజైన్లు సృష్టించాడు. విభిన్నంగా చేనేత వస్త్రాలను తయారు చేస్తూ ప్రముఖుల ప్రశంసలు పొందతూ, అవార్డులు గెలుచుకొంటున్నాడు. తానొక్కడే ఉపాధి పొందడమే కాకుండా 80మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగిన ఓ యువకుడి విజయగాథ ఇది...

భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రానికి చెందిన సాయిని భరత్ ఎంటెక్ పూర్తి చేసి ఆరేళ్లపాటు ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశాడు. చేనేత కుటుంబంలో జన్మించిన సాయిని భరత్ చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులు చేస్తున్న కులవృత్తిని చూస్తూ ఆ వృత్తిపై ఆసక్తి పెంచుకొన్నాడు. సంప్రదాయంగా వస్తున్న చేనేతలో నూతన ప్రయోగాలు, ఆవిష్కరణలు చేయడం ద్వారా ఆ వృత్తిని పది కాలాల పాటు సజీవంగా ఉంచవచ్చునని భావించాడు. దాంతో విద్యార్థి దశ నుంచే సొంతంగా చిన్న మగ్గం తయారు చేసి దానిపై ఎందరో జాతీయ నాయకుల కళాఖండాలను సృష్టించి లిమ్కాబుక్ ఆఫ్ రికార్డుతో పాటు పలు అవార్డులు సొంతం చేసుకొన్నాడు. అలా చేనేతలో నిత్య ప్రయోగాలు చేస్తూ సొంతంగా డిజైన్లు తయారు చేస్తూ దేశ, విదేశాలకు వస్త్రాలను ఎగుమతి చేస్తూ తనకంటూ సొంత ఇమేజ్‌ని సంపాదించుకొన్నాడు.

వచ్చిన అవార్డులు ఇవీ..

- 2014లో చిన్న మగ్గంపై జాతయ నాయకుల కళాఖండాలను రూపొందించినందుకు లిమ్కా బుక్ రికార్డులోకెక్కాడు
- 2014లో వండర్ బుక్ ఆఫ్ రికార్డు వరించింది
- 2014లో తెలుగు బుక్ ఆఫ్ రికార్డు
- 2014లో తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డు
- 2018లో చేనేతలో డిజైనింగ్‌లో జాతీయ మెరిట్ సర్టిఫికెట్ అందుకొన్నాడు
- 2018లో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర స్థాయి అవార్డు

రాష్ట్రంలోనే మొట్టమొదటి యూనిట్

మంత్రి కేటీఆర్ చొరవతో తెలంగాణ టెక్స్‌టైల్ అండ్ అపెరల్ పాలసీ (టీ–టాప్) కింద రాష్ట్రంలోనే మొదటిసారిగా రూ.4 కోట్ల వ్యయంతో కళా పునర్వి ఇంటిగ్రేటెడ్ హ్యాండ్లూమ్ యూనిట్‌ను నెలకొల్పాడు. ప్రస్తుతం ఇక్కడ 80 మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారు. ఈ యూనిట్‌ను అధికారికంగా మంత్రి కేటీఆర్ ఈ నెల 12న ప్రారంభించనున్నారు.

దారం నుంచి వస్త్రం వరకు..

కాగా భరత్ నెలకొల్పిన కళా పునర్వి ఇంటిగ్రేటెడ్ హ్యాండ్లూమ్ యూనిట్‌లో దారం నుంచి వస్త్రం వరకు ఇక్కడే తయారవుతాయి. బెంగుళూరు నుంచి తెప్పించిన సింగిల్ దారంను మొదట వైడింగ్ చేయడం, బాబిన్‌చుట్టడం, డబులింగ్ చేయడం, ట్విస్ట్ చేయడం, రీవైడింగ్ చేయడం, డీ గమింగ్ చేయడం, ఆసుపోయడం, మార్కింగ్ చేయడం, డిజైనింగ్ చేయడం, టై అండ్ డై చేయడం, చివరకు మగ్గంపై వస్త్రాలను నేయడం అన్ని ప్రక్రియలన్ని ఒకేదగ్గర చేయడం మరో ప్రత్యేకత. దీని వల్ల వస్త్రం ఎంతో నాణ్యతగా ఉంటుంది.

నూతన ఆవిష్కరణలు చేస్తా

ఎంటెక్ పూర్తి చేసి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా జాబ్ చేశాను. కానీ, కులవృత్తిపై ఉన్న ఫ్యాషన్‌తో జాబ్ మానేశాను. చేనేత వృత్తిలో నూతన ఆవిష్కరణలు చేస్తున్నాను. ఆ కొత్తదనమే నన్ను ఈ స్థానానికి చేర్చింది. మొట్టమొదటిసారిగా చిప్‌తో పనిచేసే ఎలక్ట్రానిక్ జకాట్ మిషన్‌ను చేనేతలో ప్రవేశపెట్టాలనే ఆలోచన చేస్తున్నాను. నాకు దేశ, విదేశాలలో కస్టమర్లు ఉన్నారు. ఆర్డర్‌పై ఎలాంటి డిజైన్‌లోనైనా వస్త్రాలను తయారు చేసే సామర్థ్యం ఉంది. మంత్రి కేటీఆర్ చొరవతో టి–టాప్ ద్వారా హ్యాండ్లూమ్ యూనిట్‌ను నెలకొల్పి 80 మందికి పని కల్పిస్తున్నందుకు సంతోషంగా ఉంది.

– సాయిని భరత్, కళాపునర్వి హ్యాండ్లూమ్స్, భూదాన్‌పోచంపల్లి



రెండువైపులా డిజైన్లు కల్గిన దుప్పట్టాను ప్రదర్శిస్తున్న సాయిని భరత్

నూతన డిజైన్ల రూపకల్పన

భరత్ నిత్య ప్రయోగశీలి. అతనికి చిన్నప్పటి నుంచి కళ పట్ల మక్కువ, సృజనాత్మకత మెండు. దాంతో నేటి యువత అభిరుచులకు అనుగుణంగా ప్రాంతాలకు అనుగుణంగా చేనేతలో వినూత్న డిజైన్లు రూపొందిస్తున్నాడు. రెండువైపులా వేర్వేరు డిజైన్లు, రంగులు కల్గిన దుప్పట్టాను రూపొందించాడు. కస్టమర్ల ఆర్డర్‌పై ఎలాంటి డిజైన్ అయినా కంప్యూటర్‌లో రూపొందించి దానిని వస్త్రంపై ఆవిష్కరిస్తున్నాడు. అంతేకాక నాణ్యతమైన వస్త్రాలను రూపొందిస్తూ, దేశంలోని ప్రధాన నగరాలు, షోరూమ్‌లతో పాటు ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్, వాట్సప్ లాంటి సోషల్ మీడియా ద్వారా విదేశాలకు సొంతంగా మార్కెటింగ్ చేస్తున్నాడు.



కంప్యూటర్‌లో డిజైన్‌లను రూపొందిస్తున్న సాయిని భరత్

కల్తీపాల తయారీ కేంద్రంపై పోలీసుల దాడి



పోలీసులు స్వాధీనం చేసుకున్న కల్తీ పాలు

చౌటుప్పల్ : చౌటుప్పల్ మండల పరిధి ఖైతాపురం గ్రామంలోని కల్తీ పాల కేంద్రంపై శుక్రవారం ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. కల్తీ పాలు, తయారీ పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ దేవేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఖైతాపురం గ్రామానికి చెందిన కందగట్ల మల్లారెడ్డి(47) వృత్తిరీత్యా పాల వ్యాపారం చేస్తున్నాడు. కొంత కాలంగా కల్తీ పాలను తయారు చేస్తున్నాడన్న సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. అప్పటికే తయారు చేసి సిద్ధంగా ఉంచిన కల్తీ పాలను, అందుకు వినియోగించే పాలపౌడర్ ప్యాకెట్లు, అరలీటర్ హైడ్రోజన్ పెరాక్సైడ్, రెండు క్యాన్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తి అరెస్టు

- మూడున్నర తులాల బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీసీపీ రాజేష్‌చంద్ర



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేష్‌చంద్ర

భువనగిరి: చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ రాజేష్‌చంద్ర తెలిపారు. శుక్రవారం డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్‌కు చెందిన అంకువారి శివకుమార్ 2019లో శామీర్‌పేటకు చెందిన లావణ్యను వివాహం చేసుకున్నాడు. అతను చెడు వ్యసనాలకు బానిస కావడంతో భార్య గొడవ పడి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో శివకుమార్ గత మూడు నెలల నుంచి ఉద్యోగం మానేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. ఇదే సమయంలో బోడుప్పల్‌కు చెందిన అతని స్నేహితుడు జమదార్ నర్సింగ్‌తో కలిసి చైన్ స్నాచింగ్ చేయాలని నిర్ణయించుకున్నాడు. వారి స్నేహితుడు నితిన్ వద్ద బైకు తీసుకుని దాని నంబర్‌ప్లేట్‌ను తొలగించారు. ఇద్దరూ కలిసి ఈ నెల 1వ తేదీన బైక్‌పై భువనగిరి పట్టణ శివారులోని డాల్ఫిన్ హోటల్ ఎదురుగా ఉన్న అండాలునగర్ ఏరియాలో రోడ్డు పక్కన ఒంటరిగా ఉన్న మహిళ మెడలోని పుస్తెలతాడును అపహరించారు. దీనిని ఈ నెల 2న సికింద్రాబాద్‌లోని జ్యూవెలర్స్ షాప్‌లో విక్రయించారు. మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం భువనగిరి పట్టణంలోని టీచర్ కాలనీ చౌరస్తా వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా శివకుమార్ బైకును ఆపి విచారించారు. చోరీ చేసిన విషయాన్ని అతను అంగీకరించాడు. అతడి వద్ద బైకు, ఫోన్, బంగారం విక్రయించిన షాప్ వద్దకు వెళ్లి పుస్తెలతాడును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతనిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ చెప్పారు. కాగా.. నర్సింగ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ రవికుమార్, ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ సుధీర్ కృష్ణ, ఎస్సై అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి



లింగస్వామి (ఫైల్)

వలిగొండ : వేర్వేరు చోట్ల విద్యుదాఘాతంతో ఇద్దరు మృతిచెందారు. వలిగొండ మండలం నాతాళ్లగూడెం గ్రామానికి చెందిన జిల్లా లింగస్వామి(39) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. లింగస్వామి రోజూ మాదిరిగా పొలానికి నీరు పెట్టేందుకు గురువారం సాయంత్రం వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. రాత్రి 11 గంటలవరకు ఇంటికి తిరిగి రాలేదు. కంగారు పడిన అతడి భార్య దగ్గరి బంధువులను భర్త గురించి ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. అనంతరం బంధువులు వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి చూడగా లింగస్వామి కాలువలో ఇరుక్కున్న చెత్త తొలగించడానికి ప్రయత్నిస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతిచెందినట్లు గుర్తించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.

43 పోస్టులు.. 106 మంది అభ్యర్థులు

భువనగిరి : జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న 43 పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. మొత్తం 573 దరఖాస్తులు రాగా ఒక్కో పోస్టుకు ముగ్గురి చొప్పున పిలిచి శుక్రవారం డీఈఓ కార్యాలయంలో సర్టిఫికెట్లను పరిశీలించారు. 109 మంది అభ్యర్థులకు 106 మంది హాజరయ్యారు. సర్టిఫికెట్ల పరిశీలనకు 5కౌంటర్లు ఏర్పాటు చేశారు. సరిఫికెట్ల పరిశీలన అనంతరం జాబితాపై శనివారం మధ్యాహ్నం 2 గంటల లోపు అభ్యంతరాలు స్వీకరించి పరిశీలిస్తారు. సాయంత్రం తుది జాబితా వెల్లడించనున్నారు. ఎంపికైన వారికి 13న నిర్వహించే కౌన్సిలింగ్ తప్పనిసరిగా హాజరు కావాలని డీఈఓ నారాయణరెడ్డి సూచించారు.

వేర్వేరు కారణాలతో ఆరుగురి బలవన్మరణం



మునుగోడు మండలం కొరటికల్ విచారణ చేస్తున్న పోలీసులు

బీబీనగర్: అప్పుల బాధతో ఇద్దరు.. కుటుంబ సమస్యలతో ఒకరు.. భర్త మద్యానికి బానిసయ్యాడని మరొకరు.. మానసిక ఒత్తిడితో ఇంకొకరు, రైలు కింద పడి వేరొకరు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఉమ్మడి జిల్లాలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి.

భర్త మద్యానికి బానసయ్యాడని..

కరీంనగర్ జిల్లా వీణవంక గ్రామానికి చెందిన నల్ల మానస(33)కు అదే ప్రాంతానికి చెందిన శ్రీనివాస్‌తో 2014లో వివాహమైంది. వీరికి కుమారుడు సంతానం. ఉపాధి కోసం శ్రీనివాస్ కుటుంబంతో కలిసి కొన్నేళ్ల క్రితం బీబీనగర్‌కు వలస వచ్చాడు. ఘట్కేసర్ మండలం బోగారం గ్రామంలోని లిక్కర్ గోదాంలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శ్రీనివాస్ మద్యానికి బానిసయ్యాడు. ఆర్థిక ఇబ్బందులు అధికం కావడంతో భర్తను మద్యం మానేయాలని కోరినా శ్రీనివాస్ పట్టించుకోవడం లేదు. దీంతో మనస్తాపం చెందిన మానస గురువారం రాత్రి కుమారుడు నిద్రపోయాక, ఇంట్లో భర్త లేని సమయంలో ఉరేసుకుంది. శుక్రవారం ఉదయం ఇరుగు పొరుగు వారు గమనించి ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బోగారం ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగేంధర్ తెలిపారు.

కృష్ణానదిలో దూకి..

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కోనసీమ జిల్లాకు చెందిన నార్ని నాగేశ్వరావు(27) అమలాపురంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగించేవాడు. మూడు నెలల క్రితం నాగేశ్వర్‌రావు ఉద్యోగం మానేసి హైదరాబాద్ బాటపట్టాడు. అక్కడే గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. మూడు నెలలుగా ఉద్యోగం లేక, ఇతర మానసిక ఒత్తిడిలతో మనస్తాపం చెందిన నాగేశ్వర్‌రావు ఈ నెల 9న హైదరాబాద్ నుంచి సాగర్‌లోని కొత్త బ్రిడ్జి వద్దకు చేరుకుని నదిలోకి దూకాడు. శుక్రవారం ఉదయం మృతదేహం తిరుమలగిరి మండలంలోని జమ్మన కోటతండా వద్ద నీళ్లలో తేలియాడంతో అటుగా వెళ్తున్న వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ సురేష్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఉన్న ఐడీ కార్డుల ఆధారంగా నాగేశ్వరావుగా గుర్తించారు. అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత మృతదేహాన్ని అప్పగించారు. మృతుడి బావ సతీష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మానస (ఫైల్)



నాగేశ్వరావు(ఫైల్)

రైలు కిందపడి..

భువనగిరి : భువనగిరి పట్టణం బహార్‌పేటకు చెందిన సిద్దంకి భానుప్రసాద్(26) ఓ దొంగతనం కేసులో జైలు వెళ్లి ఈ నెల 9న ఇంటికి వచ్చాడు. అదే రోజు మద్యం కోసం కుటుంబ సభ్యులను డబ్బులు అడిగాడు. ఇవ్వకపోవడంతో ఇంటి నుంచి బయటకు వచ్చాడు. ఈ నెల 11న ఉదయం పట్టణంలోని సుమంగళి ఫంక్షన్ హాల్ సమీపంలో సికింద్రాబాద్–కాజీపేట రైలు మార్గంలో గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రైల్వే ఇంచార్జి హెడ్ కానిస్టేబుల్ ఎస్ సత్యనారాయణ తెలిపారు.

కొరటికల్‌లో..

మునుగోడు : మునుగోడు మండలం కొరటికల్ గ్రామానికి చెందిన అన్నం కృష్ణయ్య (31) తనకున్న కొద్దిపాటి భూమిలో వరి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సాగు పెట్టుబడులకు చేసిన అప్పులు అధికం కావడం, ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం తన వ్యవసాయ భూమిలో పురుగుల మందు తాగాడు. అనంతరం భార్యకు ఫోన్ చేసి మాట్లాడకపోవడంతో అనుమానంతో వ్యవసాయ భూమి వద్దకు వెళ్లగా అప్పటికే కృష్ణయ్య మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

కుటుంబ సమస్యలతో..

అనంతగిరి: మండలంలోని గోండ్రియాలకు చెందిన ఏపూరి గాంధీ(25)కి ఏడాది క్రితం వివాహం జరిగింది. కుటుంబంలో సమస్యలు తలెత్తడంతో గ్రామ శివారులోని పాలేరు వాగు సమీపంలోని ఓ చెట్టుకు శుక్రవారం ఉరివేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

యువ రైతు ఆత్మహత్య



రాజశేఖర్‌రెడ్డి(ఫైల్)

సంస్థాన్ నారాయణపురం : చౌటుప్పల్ మండలం చింతలగూడెం గ్రామానికి చెందిన కొమరెల్లి రాజశేఖర్‌రెడ్డి(30) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తనకున్న రెండు ఎకరాలతో పాటు మరో 4ఎకరాలను కౌలుకు తీసుకుని వరి పత్తి సాగు చేస్తున్నాడు. సాగు అవసరాల నిమిత్తం రెండేళ్లుగా అప్పులు చేశాడు. ఆశించిన దిగుబడి రాకపోవడంతో అప్పుల భారం పెరిగిపోయింది. వాటిని తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలోనే రాజశేఖర్‌రెడ్డి ఈ నెల 9న వ్యవసాయ భూమి వద్దకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటికి వెళ్లాడు. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం సంస్థాన్ నారాయణపురం మండలం గుడిమల్కాపురం వ్యవసాయ పొలాల వద్ద దుర్వాసన వస్తుండడంతో రైతులు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఘటనా స్థలంలో పురుగుల మందు డబ్బా ఉండడంతో ఆత్మహత్య చేసుకున్నాడని భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చౌటుప్పల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. కాగా, రాజశేఖర్‌రెడ్డికి వారం రోజుల క్రితమే కుమార్తె జన్మించింది.

కేసీఆర్ విజన్ ఉన్న నాయకుడు

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న గొంగిడి సునీత

యాదగిరిగుట్ట: సీఎం కేసీఆర్ విజన్‌తో పనిచేసే నాయకుడని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో శుక్రవారం తుర్కపల్లి మండలం బిల్యాతండాకు చెందిన సర్పంచ్ జ్యోతి భాస్కర్ నాయక్, దయ్యాలబండ తండా సర్పంచ్ మాడోత్ లలితా శ్రీను నాయక్, రుస్తాపూర్ సర్పంచ్ వంకరి లావణ్యనారాయణ, ధర్మారం సర్పంచ్ మాలోతు మంగ్యా నాయక్, నియోజకవర్గ విద్యార్థి సంఘం నాయకుడు ర్యాకల రమేష్‌తో పాటు 300లకు పైగా నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బీక్కూనాయక్, మండల అధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా నాయకులు రవీందర్‌నాయక్, సింగిల్ విండో చైర్మన్ నర్సింహారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, బాలకృష్ణ, పాలసంఘం చైర్మన్ మహేందర్‌నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మోతీరాంనాయక్, మాజీ ఎంపీటీసీ లచ్చిరాంనాయక్, నర్సింహ నాయక్ తదితరులున్నారు.

హత్యా.. ఆత్మహత్యా..?

మోటకొండూర్ : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. మోటకొండూరు మండలం కదిరేణిగూడెం గ్రామ శివారులో వెలుగు చూసిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కదిరేణిగూడేనికి చెందిన వ్యవసాయ కూలీలు శుక్రవారం గ్రామ శివారులోని పడావుబావిలో ఓ వ్యక్తి మృతదేహం తేలియాడుతూ కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని ఏసీపీ శివరాంరెడ్డి, సీఐ సురేందర్‌రెడ్డి పరిశీలించారు. స్థానికుల సహాయంతో మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతుడి ఒంటిపై తెల్లచొక్కా, నీలి రంగు నిక్కర్ ఉన్నాయి. మృతదేహం కుళ్లిపోయి ఉండడంతో సుమారు వారం రోజుల క్రితం మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తేజంరెడ్డి తెలిపారు.